క్లుప్తంగా

ఘనంగా మద్దెలమ్మ పండుగ



మద్దెలమ్మ పూజలో పాల్గొన్న పద్మశాలీ కులస్తులు

ఆమనగల్లు: పట్టణంలోని మద్దెలమ్మ ఆలయంలో మంగళవారం పద్మశాలీ కులస్తులు ఘనంగా పండుగ జరుపుకొన్నారు. దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల ముగింపు అనంతరం పద్మశాలీలు మద్దెలమ్మ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయంలో పూజారి విజ్ఞానశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కండేయ దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి శివలింగం, కోశాధికారి సత్యరాములు, పద్మశాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మేడిగడ్డతండా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మాధురి

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డతండా, శంకరకొండ తండాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ కుసుమ మాధురి పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించారు. దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయాలని పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ వినోద, ఆయా గ్రామాల కార్యదర్శులు జగన్‌నాయక్, విజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయండి



డీజీపీ శివధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేయాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి కోరారు. డీజీపీగా నియమితులైన తులేకలాన్ గ్రామానికి చెందిన బత్తుల శివధర్‌రెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. రాంరెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలు తాగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీజీపీ శివధర్‌రెడ్డి స్పందించి తప్పకుండా చర్చించి చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

మంచాల ఏఓగా వెంకటేశ్



మంచాల: మండల వ్యవసాయాధికారిగా జి.వెంకటేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఏఓగా పని చేసిన శ్రీలత ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కొత్తగా యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వెంకటేశ్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సహకారంతో పూర్తి స్థాయిలో సేవలు అందిస్తామన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీసూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, నైవేద్యం సమర్పించారు. ఆలయం ప్రాగణంలో సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఈటీపీ

- ఎనిమిదేళ్ల క్రితం మురుగు నీటి శుద్ధికి ఏర్పాటు
- నిర్వహణ లోపించడంతో నీరుగారిన లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



చెట్లకొమ్మల మధ్య ఈటీపీ



ఈటీ ప్లాంట్‌లో శుద్ధి అవుతున్న మురుగు నీరు (ఫైల్)

కడ్తాల్: మురుగు నీటి శుద్ధి కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఈటీపీ) శిథిలావస్థకు చేరింది. నాడు పాలశీతలీకరణ కేంద్రంలో నీటి వృథాను అరికట్టడంతో పాటు, పాల కేంద్రంలోని మురుగు నీటిని శుభ్రం చేసేందుకు ఈటీ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కానీ సంబంధిత అధికారులు ప్లాంట్ నిర్వహణను గాలి కొదిలేయడంతో ప్రస్తుతం ఎందుకు పనికి రాకుండా పోతుంది. ఎనిమిదేళ్ల క్రితం పాల కేంద్రంలో మురుగు సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు వ్యర్థ నీటిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగించడానికి అ.త్యాధునిక టెక్నాలజీతో అప్పట్లో ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సదుద్దేశంతో స్థాపించినా అనంతరం పర్యవేక్షణ లోపించి లక్ష్యం నీరుగారుతోంది.

రూ.23 లక్షలు ఖర్చు

మండల కేంద్రంలో పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసి సుమారు 66 సంవత్సరాలు కావొస్తుంది. అత్యధిక పాల ఉత్పత్తిలో సమైక్య రాష్ట్రంలోనే ఎంతో పేరు గడించింది. మండలంతో పాటు, సమీప మండలాల్లోని 100కు పైగా సొసైటీల నుంచి నిత్యం పాల సేకరణ చేస్తుంటారు. పాడిపరిశ్రమాభివృద్ధి పథకం రాష్ట్రీయ కర్షక్ వికాస్ యోజన కింద రూ.23 లక్షలతో 2017లో ఈటీపీ ఏర్పాటు చేశారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రంలో నిత్యం 5 వేల నుంచి 10 లీటర్ల వరకు వృథాగా పోతున్న నీటిని ఈ యంత్రంతో శుద్ధి చేశారు. నాలుగైదు ఏళ్ల పాటు ప్లాంట్ బాగానే నడిచింది. క్రమేపి నిర్వహణ లోపించి ప్లాంట్ శిథిలావస్థకు చేరింది. చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు, పచ్చి గడ్డి పొదలు అలుముకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు, స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం



ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాను. త్వరలోనే మరమ్మతులు చేయించి ఈటీ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తా.

– ప్రాణేశ్‌కుమార్, మేనేజర్, పాలశీతలీకరణ కేంద్రం

మహాసభలకు తరలిరండి



హయత్‌నగర్: మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్, నాయకులు



ఇబ్రహీంపట్నం: వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కార్మికులు

14, 15 తేదీల్లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి సభ

హయత్‌నగర్: తుర్కయంజాల్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కమిషనర్ అమరేందర్‌రెడ్డి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై, వారి పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై రెండు రోజులు ప్రతినిధులు చర్చిస్తారని చెప్పారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు శ్రీనివాస్, బాలరాజు, సీఐటీయూ నాయకులు దాసు, నవీన్, రవిచందర్, అర్జున్, మధు, అమర్, నగేష్ వెంకమ్మ, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మున్సిపాలిటీ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశ్ కోరారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో మహాసభకు సంబంధించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14, 15 తేదీల్లో తుర్కయంజాల్‌లో ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, ప్రమాద బీమా రూ.10 లక్షలు, వారంతపు సెలవులు ఇవ్వాలనే డిమాండ్లతో సభలో చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, యాదయ్య, శంకర్, భాస్కర్, యాదగిరి, అండాలు, సంతోష, రమాదేవి, జంగమ్మ, మైసమ్మ, బుగ్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచిరెడ్డి మార్నింగ్ వాక్

యాచారం: ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బుధవారం యాచారం మండల కేంద్రంలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్ బాకీ కార్డులను యాచారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉదయం 8 గంటలకు మార్నింగ్ వాక్‌తో ఇంటింటికి తిరిగి పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ తెలిపారు. యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని చెప్పారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్‌ను కల్వకుర్తి జేఏసీ చైర్మన్ అయిల సదానంద్‌గౌడ్ సత్కరించారు. మంగళవారం కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారిని సన్మానించి, పేదలకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు గణేశ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల నూతన కార్యవర్గం

ఆమనగల్లు: తలకొండపల్లి మండల ఆశాకార్యకర్తల నూతన కార్యవర్గం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సీఐటీయూ ఆమనగల్లు కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఆశాకార్యకర్తల సంఘం అధ్యక్షురాలిగా సుజాత, ప్రధాన కార్యదర్శిగా విమల, కోశాధికారిగా మాధవి, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, సహాయ కార్యదర్శిగా సునీత, సభ్యులుగా తదితరులను ఎన్నుకున్నారు.



సమావేశంలో ఆశా కార్యకర్తలు

స్థానిక ఎన్నికలకు పటిష్ట భద్రత

ఆమనగల్లు సీఐ జానకీరాంరెడ్డి

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమనగల్లు సీఐ జానకీరాంరెడ్డి చెప్పారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అన్నిశాఖల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో సీఐతో పాటు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల ఎంపీడీఓలు మాధురి, సుజాత, శ్రీకాంత్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, వరప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా అన్ని మండలాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం సీఐ జానకీరాంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో అదనపు బలగాలను బందోబస్తు కోసం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు మండలంలో 5 సమస్యాత్మక, తలకొండపల్లి మండలంలో 6 అత్యంత సమస్యాత్మక, 7 గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు గతంలో అల్లర్లకు కారణమైన వారిపై నిఘా ఉంచుతామని చెప్పారు.



సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాస్వామ్యానికి దొంగ ఓట్లు గొడ్డలిపెట్టు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కేఎల్లార్, నాయకులు

కందుకూరు: ప్రజాస్వామ్యానికి దొంగ ఓట్లు గొడ్డలి పెట్టులాంటివని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆకులమైలారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ల చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని అంబేడ్కర్, బాబుజగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. రాజ్యాంగం, రిజర్వేషన్లపై బీజేపీ దాడి చేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న కొన్ని వర్గాల ఓట్లను బీజేపీ, ఈసీ తొలగిస్తూ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కులం, మతం ఆధారంగా ఓట్లను తొలగిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో జల్‌పల్లి మున్సిపాలిటీలో వేలాది దొంగ ఓట్లను నమోదు చేశారని ఆరోపించారు. అర్హుల ఓట్లు తొలగించినా, బయటి వ్యక్తుల ఓట్లు నమోదు చేసినా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని అంతం చేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ప్రతీ బూత్‌స్థాయిలో వంద సంతకాలు పెట్టించి ఈసీకి నిరసన తెలపాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, మాజీ చైర్మన్ సరికొండ మల్లేశ్, డైరెక్టర్లు సురేందర్, ప్రశాంత్, యుగంధర్, సీనియర్ నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, చిర్ర సాయిలు, డి.శ్రీధర్, వెంకటేశ్‌గౌడ్, సురేష్, భూపాల్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, ఎస్.పాండు, మదన్‌పాల్‌రెడ్డి, జి.నర్సింహ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అప్రజాస్వామికం



మంచాల: ఆరుట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



ఆమనగల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మంచాల: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మండలంలోని ఆరుట్లలో ప్రజా సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్‌పై దాడి అప్రజాస్వామికమన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఓ దళితుడు అయినందునే మనువాదులు దాడి చేశారని ఆరోపించారు. ఈ సంఘటనను యావత్ భారతదేశం ముక్త కంఠంతో ఖండించాలని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మురళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, కో–ఆప్షన్ మాజీ సభ్యులు సలాం, యూసుఫ్ అలీ, నాయకులు భాస్కర్, పరమేష్, విజయ్, శ్రవణ్‌కుమార్, మహేష్, వినోద్‌కుమార్, శేఖర్, రంజిత్, శ్రీశైలం, రమణారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఆమనగల్లు: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మంగళవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజేఐ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్ మాట్లాడుతూ.. సీజేఐపై దాడి ఘటన చరిత్రలో చీకటిరోజుగా మిగులుతుందన్నారు. దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆంజనేయులు, రామకృష్ణ, విజయ్‌కుమార్‌గౌడ్, కృష్ణ, శేఖర్, మల్లేశ్, జానకిరాములు, మధుగౌడ్, గణేశ్‌గౌడ్, దేవేందర్, జగన్‌గౌడ్, శేఖర్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే వారికే గుర్తింపు

కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో మంగళవారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసి, ప్రజాభిమానం ఉన్న నాయకుల వివరాలను పీసీసీకి నివేదిస్తామని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్‌కు విజయ సోపానాలని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కడ్తాల్, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బిచ్యానాయక్, జగన్, రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షులు రాములు, నాయకులు అనితవిజయ్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, ఫరీద్, రవీందర్‌నాయక్, మానయ్య, మల్లయ్య, జి.శ్రీనివాస్‌రెడ్డి, హన్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిపాలనపై అవగాహన



కమిషనర్ బాలకృష్ణను కలిసిన గ్రూప్–1 అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన వారికి శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా మూడు రోజులుగా ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయానికి కేటాయించిన గ్రూప్–1 అధికారులు పల్వాయి రాకేష్, పడమటి వెంకట్‌రెడ్డిలకు కమిషనర్ బాలకృష్ణ అవగాహన కల్పిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసుళ్లు, ఇంజనీరింగ్ విభాగం, టౌన్‌ప్లానింగ్ విభాగం చేస్తున్న పనులను నిత్యం వివరిస్తున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల ఖర్చు, జనరల్ ఫండ్స్ తెలియజేశారు. వార్డుల వారీగా అధికారులు విధులపై చర్చిస్తున్నారు. ఎన్నికలు నిర్వహణ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పోస్టింగ్స్ ఇచ్చేంత వరకు ఇక్కడే సమగ్రంగా విషయ పరిజ్ఞానం కల్పించేందుకు కృషి చేస్తానని కమిషనర్ బాలకృష్ణ మంగళవారం తెలిపారు.

అన్ని స్థానాల్లో పోటీ ఇస్తాం

బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలో జెడ్పీటీసీతో పాటు 8 ఎంపీటీసీ స్థానాలతో బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఆ పార్టీ సీనియర్ నాయకులు ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేతలను సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. దీంతో పాటు ఏఏ స్థానాలకు ఎవరెవరు పోటీల్లో ఉంటారని తెలుసుకుని వారి పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలని చర్చించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాపయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు సాయికిరణ్‌గౌడ్, నాయకులు విష్ణుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, జంగమయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, బలదేవరెడ్డి, వీరస్వామిగౌడ్, నవీన్‌కుమార్, వెంకటేశ్‌గౌడ్, రమేశ్, సురేశ్‌గౌడ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు చార్జీలు తగ్గించాలని డిమాండ్



జాపాలలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల: పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలు వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జాపాల గ్రామంలో ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. గడిచిన రెండున్నర ఏళ్ల కాలంలో ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు చేయలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి పేదోడికి పూటగడవని దుస్థితి నెలకొందన్నారు. ఈ సమయంలో ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడం దారుణమన్నారు. వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో తగ్గిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సంజీవ, సతీష్, చంద్రకాంత్, యాదయ్య, నర్సింహ, సోమేశ్, వెంకటేష్, సుదర్శన్, గణేష్, రాజు, పెంటప్ప, యాసిన్ పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా

ఏఐసీసీ కో–ఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: న్యూ తిరుమలనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏఐసీసీ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కాలనీలో పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయించి, అర్ధంతరంగా నిలిచిన పనులను పూర్తి చేయిస్తామన్నారు. సమస్యలను మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని కాలనీవాసులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదయ్య, శివాజీ, శివరాంరెడ్డి, ఈదయ్య, నారాయణ, ఇస్మాయిల్, మధు, రవి, ప్రభాకర్‌రావు తదితరులు ఉన్నారు.